ప్రజాశక్తి
బుధవారం 19 జూన్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మున్నేరులో ఇసుకాసురులు

- ఇసుక దందాకు అధికార పార్టీ అండ
- ఆగని అక్రమ రవాణా
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ప్రజాశక్తి-నందిగామ

అధికారులు దాడులు చేసిన ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్లను పట్టుకుంటున్నా మున్నేరులో ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు. పశ్చిమ కృష్ణా, జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలంలోని శనగపాడు గ్రామ శివారు మున్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. నిన్న మొన్నటి వరకు వైసిపి నాయకులు మాత్రమే ఇసుక దోపిడీ కొనసాగించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు గత వారం రోజుల నుంచి శనగపాడు రీచ్‌లో జెసిబిలు పెట్టి మరీ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తమకు ఏమీ కాదనే ధీమాతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక అక్రమ రవాణా చేసేవారు తమ గ్రామ అవసరాలకు కాకుండా శనగపాడు రీచ్ నుంచి నందిగామ శివారు అనాసాగరం మీదుగా 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కన మునగచర్ల, తోటచర్ల పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా డంప్ చూసి రాత్రి సమయంలో ఇతర ప్రాంతాల లారీలకు లోడు చేసి అమ్మి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మొన్న రాత్రి శనగపాడు రీచ్ నుంచి నందిగామ శివారు అనాసాగరం మీదుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు టాక్టర్లును నందిగామ పోలీసులు పట్టుకున్నారు. వీటిని పోలీసుస్టేషన్ కు తరలించారు.

పోలీసుల తీరు విచిత్రం

గత ఐదు సంవత్సరాలుగా ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోక పోగా ఫిర్యాదు చేసిన, అక్రమ రవాణాను అడ్డుకున్న వారిపై (మిగతా 2లో)

రెండు రోజుల క్రితం నందిగామ పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

విమానాశ్రయ నిర్వాసితులకు నష్టపరిహారం

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మాట్లాడుతన్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణలో భాగంగా అభివృద్ధికి భూములిచ్చిన రైతులు, భూ యజమానులకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి గన్నవరం విమానాశ్రయ విస్తరణ సమస్యలపై ఎయిర్‌పోర్టు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గన్నవరం విమానాశ్రయ అభివృద్ధిలో భాగంగా భూములు ఇచ్చిన దావాజీగూడెం, బుద్దవరం గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కింద చినఅవుటపల్లిలో ఐదు సెంట్ల స్థలంతో పాటు రూ.9 లక్షల నగదును ఇప్పటికే కొంతమందికి చెల్లించామని చెప్పారు. మిగతా అందరికీ నష్టపరిహారం చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదే విధంగా వ్యవసాయ రైతులకు ప్రతి ఏటా చెల్లించాల్సిన యాన్యుటి చెల్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. విమానాశ్రయ అభివృద్ధికి భూములు ఇచ్చిన ప్రైవేటు వెంచర్ల యజమానులకు అజ్జంపూడి గ్రామంలో భూమికి భూమి కేటాయింపు, లేఅవుట్ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఎపిసిఆర్‌డిఎ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. విమానాశ్రయానికి సమీపంలోని ఏలూరు (మిగతా 2లో)

లోపించిన పర్యవేక్షణ... నిధుల కొరత

- అధ్వానస్థితిలో పిఎన్ బస్‌స్టేషన్
- స్లాబ్ దెబ్బతిన్నా మరమ్మతులు నిల్
- సర్వీసుల కొరతతో ప్రయాణికుల నిరీక్షణ

బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. కనీస మరమ్మతు పనులు జరగడం లేదు. ఎపిఎస్ఆర్‌టిసి రాష్ట్ర కేంద్రానికి తలమానికంగా ఉన్న పిఎన్ బస్‌స్టేషన్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించకుండా సంబంధిత ఉన్నత అధికారులు సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎపిఎస్ఆర్‌టిసి సంస్థ పూర్తిగా నిరాదరణకు లోనైంది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంలోనైనా ఆర్‌టిసి పూర్వవైభవం వస్తుందేమోనని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

పెచ్చులూడుతున్న స్లాబు

గత వైసిపి ప్రభుత్వం ఆర్‌టిసిని విలీనం పేరుతో దానిని అభివృద్ధి చేయకపోగా పూర్తిగా నిర్వీర్యం చేసిందనే విమర్శ లేకపోలేదు. ప్రధానంగా పిఎన్ బస్‌స్టేషన్ నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేయడంలో, దానిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం, దాని యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని దాని దుస్థితే విధితం చేస్తుంది. బస్‌స్టేషన్‌లోని డిపార్చర్ బ్లాక్‌లో కాకినాడ, (మిగతా 2లో)

హోం మంత్రి క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు నుంచి తాడిగడప వెళ్లే వంద అడుగుల రోడ్డులో హోం మంత్రి క్యాంపు కార్యాలయం, విడిద ఇల్లుకు శాస్త్రోకంగా బుధవారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనితకు భవనం యాజమాని ప్రముఖ పారిశ్రామికవేత్త, లయన్స్ గవర్నర్ పుట్టగుంట సతీష్‌కుమార్ స్వాగతం పలికారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

వెహికల్ డిపో కార్మికుల ధర్నాలో కాశీనాథ్ హెచ్చరిక

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన వెహికల్ డిపో కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వెహికల్ డిపో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ కార్పొరేషన్ వెహికల్ డిపో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు డిపో ఎదుట కార్మికులు మెరుపు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి కాశీనాథ్ మాట్లాడుతూ వెహికల్ డిపో కార్మికుల సమస్యలపై ఇప్పటి వరకు ఐదు సార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా, కార్మికులు పలు సార్లు అధికారులను కలిసి వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. డిపోలోని మెకానిక్స్‌నందరినీ క్లీన్ ఎన్విరాన్మెంట్‌లోకి మార్చి వేసి వారికి వేతనాలు పెంచాలని కోరారు. కార్మికులకు గత సంక్రాంతి పండుగకు నగరపాలక సంస్థ అధికారులు ఇస్తామన్న రూ.వెయ్యి వెంటనే ఇవ్వాలని కోరారు. ఎక్సెల్ ప్లాంట్‌లోని కార్మికుల సదుపాయం కోసం నిర్మించిన వాటర్, బాత్రూమ్స్‌ను ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్మికులకు రెండు సంవత్సరాల నుంచి ఇవ్వాల్సిన యూనిఫాం, చెప్పులు, రైన్ కోట్లు, సబ్బులు, టవల్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. హెవీ లైసెన్స్ ఉన్న క్లీనర్లను డ్రైవర్లుగా ప్రమోట్ చేయాలని గతం నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. టార్గెట్ విధించకుండా చెత్తనంతటినీ అన్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పని భారంతో పాటు చాలీచాలనీ వేతనాలతో కార్మికుల (మిగతా 2లో)

ఈఈ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ గౌరవాధ్యక్షులు కాశీనాథ్, కార్మికులు

డిప్యూటీ సిఎంకు స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం

ప్రమాణ స్వీకార అనంతరం ఎపి సచివాలయానికి వస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి విమానాశ్రయంలో పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో వివిధ మున్సిపాలిటీలలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టర్ బంగ్లా నుండి మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసిన భవనాల్లో సచివాలయాలు ఉంటే, వాటిని అనువైన ప్రదేశానికి షిఫ్ట్ చేయడానికి చర్యలు తీసుకోవాలని, వాటిని అన్నా క్యాంటీన్ కు వినియోగించుకునేందుకు అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ఆర్థిక అంచనాలు రూపొందించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడు స్తంభాల సెంటర్లో గతంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ భవనంలో సచివాలయం ఏర్పాటు చేశారని, దానిని షిఫ్ట్ చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని, కమిషనర్ బాపిరాజు తెలుపగా, దానిలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. గుడివాడలో గతంలో రెండు అన్న క్యాంటీన్లు ఉండేవని, ఒకదానిలో సచివాలయం ఏర్పాటై ఉందని, దాన్ని వేరేచోటికి షిఫ్ట్ చేయటకు చర్యలు తీసుకుంటున్నామని, ఉన్న వాటిని అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అనువుగా అవసరమైన మరమ్మత్తులు చేపట్టకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కమిషనర్ బాలసుబ్రమణ్యం కలెక్టర్కు వివరించగా, అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన ఫర్నిచర్ విద్యుత్ మరమ్మత్తులు చేపట్టుటకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పెడన, ఉయ్యూరు మున్సిపాలిటీలలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని, అవసరమైన ప్రతిపాదన పంపాలని కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. తాడిగడప మున్సిపాలిటీ కొత్తగా ఏర్పడినందున అన్న క్యాంటీన్ లేదని, ప్రభుత్వం అన్న క్యాంటీన్ మంజూరు చేసిన అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకటేశ్వరరావు కలెక్టర్కు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

మున్నేరులో ఇసుకాసురులు

కేసులు నమోదు చేశారు. అలాగే అప్పటి అధికార పార్టీ నాయకులు కాకుండా సామాన్యులు ఇసుక రవాణా చేసుకుంటే ఆ పార్టీ నాయకులు చెప్పగానే ఆ ట్రాక్టర్లను అడ్డుకుని వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేసేవారు. ప్రతిపక్షంలో ఉండి ఇసుక అక్రమ రవాణాపై ఆందోళన వ్యక్తం చేసిన నాయకులు ఇప్పుడు అధికార పార్టీ ఎంఎల్ఎలుగా గెలుపొందారు. ప్రస్తుతం వీరి దగ్గరకు ఇసుక అక్రమ మాఫియా తమ గ్రామాలలో ఇసుక రవాణా చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే పెనుగంచిప్రోలు మండలం పరిధిలోని శనగపాడు, నందిగామ శివారు అనాసాగరంలో ఇసుక అక్రమ రవాణా భారీ స్థాయిలో చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో వరుసగా గత రెండు రోజులుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వీటిపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయకుండా ప్రస్తుత అధికార పార్టీ ఎంఎల్ఎల ఒత్తిడి వల్ల తమ చేతికి మట్టి అంటకుండా ఎంఆర్ఒలకు సమాచారం ఇచ్చి వారి ఆదేశాలు మేరకు కేసు నమోదు చేస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంఆర్ఓ కార్యాలయంలో సంబంధిత అధికారులు కేవలం జరిమానా వేసి ట్రాక్టర్లను వదిలి వేసేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు సమాచారం. ప్రతిపక్షంలో ఉండగా అక్రమ ఇసుక రవాణా అంటూ గగ్గోలు పెట్టిన వారే నేడు ఆ అక్రమ ఇసుక రవాణాకు అండదండలు ఇవ్వడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నందిగామలో పసుపు రంగు చొక్కాలు వేసుకుని వచ్చిన నాయకులకు ఆర్‌డిఒ స్థాయి అధికారులు రాచమర్యాదలు చేసి ఇసుక ట్రాక్టర్లు విడుదల చేయడం కొసమెరుపు.

విమానాశ్రయ నిర్వాసితులకు నష్టపరిహారం

కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నిర్మాణం చేపట్టకపోవడానికి గల కారణాలను తెలియజేయాలన్నారు. ఎయిర్‌పోర్టులో పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు త్వరలో ఇతర అధికారులతో కలిసి గన్నవరంలో పర్యటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎంఎల్‌కె రెడ్డి, గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, గన్నవరం తహశీల్దార్ ఎన్ఎస్ పవన్‌కుమార్, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ తేజేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

అవస్థలు వర్ణనాతీతమని చెప్పారు. అనేక అనారోగ్య సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నా కనీస వైద్యం అందుబాటులో ఉండటం లేదన్నారు. కార్మికులకు ఇస్తున్న వెహికల్స్ కండీషన్స్‌లో లేక పలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని, అధికారులు వాహనాల మరమ్మతులను పూర్తిగా విస్మరించారని అన్నారు. వాహనాలకు మరమ్మతులు చేయకుండానే కాంట్రాక్టర్ల ద్వారా వాహనాలను ఏర్పాటు చేయించి కోట్లాది రూపాయలు ప్రైవేటు వారికి దోచిపెట్టే విధానాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిపో ఇఇ సత్యనారాయణ, డిపో నిర్వాహకులు ఓబేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై అధికారులు స్పందించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను నగర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి దనికొండ వెంకటేశ్వరరావు, వెహికల్ డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎం.హరిబాబు, జె.నాగరాజు, టి.ప్రవీణ్, ఇమ్మానియేలు, ఎం.నరసింహారావు, రవి, జి.మహేష్, సారథి పాల్గొన్నారు.

లోపించిన పర్యవేక్షణ... నిధుల కొరత

రాజమండ్రి సర్వీసుల ప్లాట్‌ఫారమ్స్ సమీప బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్‌కు సంబంధించిన బీమ్స్‌కు కాంక్రీట్ ఊడిపోయి, ఇనుప చువ్వలు తుప్పు పట్టి బయటకు కనిపిస్తున్నాయి. దీనికి ఎదురుగా కూడా షాపింగ్ మాల్స్ ఉన్న స్లాబ్ పరిస్థితి ఇంతే. ఈ పరిస్థితి ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ కనీస మరమ్మతు పనులు కూడా చేయలేదు. బస్‌స్టేషన్ మొత్తం విద్యుత్, కేబుల్ వైర్లు, నెట్ వైర్లు ఇలా అనేక రకాలుగా వినియోగించే వైర్లు చిందరవందరగా అస్తవ్యస్తంగా కిందకు వేలాడుతూ కనిపిస్తున్నా వాటిని సరి చేసే పరిస్థితి లేకుండా పోయింది. లైటింగ్ వ్యవస్థ కూడా అధ్వానంగా తయారైంది. సుదూరు ప్రాంతాలకు వెళ్లాల్సిన సర్వీసులను బస్‌స్టేషన్ ఎదురుగా పార్కింగ్ చేస్తుంటారు. అయితే ఇక్కడ పూర్తి స్థాయిలో లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో సంబంధిత డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణకు తగిన సంఖ్యలో కార్మికులు లేకపోగా ఉన్న వారితో పూర్తిస్థాయిలో చేయించే పరిస్థితి లేకుండా పోయింది. బస్‌స్టేషన్ ప్రాంగణంలో గుండా ప్రవహించే పెద్ద డ్రైన్లు డీసిల్టింగ్ పని చేయించే నాథుడే లేక మురుగు కంపు కొడుతుంటుంది. నాలుగు వైపులా ఎక్కడిదక్కడ మురుగు ఆగిపోయి దుర్వాసన వస్తుంటుంది. పారిశుధ్య నిర్వహణకు సదరు కాంట్రాక్టర్‌కు ఆర్టీసి యాజమాన్యం నెలకు వచ్చేసరికి లక్షలాది రూపాయలు వెచ్చించడమే తప్ప సంబంధిత అధికారులు సమీక్షించడం, పర్యవేక్షించడం అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. బస్‌స్టేషన్ ఔట్ గేట్ (సైకిల్ స్టాండ్) సమీపంలో చెత్తా, ఇతర వ్యర్థాలతో నిండిపోయి డంపర్ బిన్స్ దర్శనమిస్తుంటాయి. ఇక్కడే కుక్కలు, ఆవులు, పందులు సంచరిస్తూ అపరిశుభ్రత వాతావరణాన్ని కల్పిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మరోపక్క పొదుపు పేరుతో సెక్యూరిటీ సిబ్బందిని సగానికి సగం మందిని తగ్గించిన కారణంగా నాలుగు వైపులా పర్యవేక్షించే నాథులు కరువయ్యారు. సర్వీసులను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తూ, బస్‌స్టేషన్ ప్రాంగణంలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పని చేయాల్సిన ట్రాఫిక్ కంట్రోలర్స్, సూపర్‌వైజర్లు కూడా క్రమంగా తగ్గిపోతున్నారు. సర్వీసులకనుగుణంగా ప్లాట్‌పారమ్స్ సంఖ్య లేకపోవడం, ఉన్న ప్లాట్‌ఫారమ్స్ మీదనే అన్ని సర్వీసులను నిలుపుదల చేయాల్సి వస్తుండటంతో ఒక దాని వెనుకాల ఒకటి ఆపుకోవాల్సి రావడం, ట్రాఫిక్ స్తంభించిపోయి, దాని నుంచి బయటపడటానికి సదరు డ్రైవర్లకు తలకు మించిన భారంగా తయారైంది. బస్‌స్టేషన్ చుట్టుపక్కల మొత్తం కాంక్రీట్ ఫ్లోరింగ్ ఎక్కడికక్కడ దెబ్బతింది. పెరుగుతున్న ప్రయాణికులకనుగుణంగా రేపల్లె (కరకట్ట సర్వీసు) అవనిగడ్డ (కరకట్ట), మంగళగిరి, రాజధాని అమరావతి తదితర రూరల్ ఏరియాలకు సర్వీసుల సంఖ్య తగ్గిపోవడంతో వాటి కోసం ప్రయాణికులు నిరీక్షించక తప్పడం లేదు. కనీసంగా ఎరైవల్ బ్లాక్‌లో సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. సర్వీసు రాకపోకలు తెలిపే బోర్డులు కూడా ఏర్పాటు చేసే పరిస్థితి కానీ, చెప్పే సిబ్బంది కానీ లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి సర్వీసుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. చివరకు ప్రైవేటు వాహనాలకు అధిక ఛార్జీలు వెచ్చిస్తూ వెళ్లక తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో నూతన ప్రభుత్వమైనా నిధులు కేటాయించి బస్‌స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రయాణికులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

మంత్రిని కలిసిన సుందరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి: బిసి, మత్స్య శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ విజయవాడలోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.శశిరాజ్, టి.సాంబయ్య, భాస్కర్, కోటేశ్వరరావు, టి.సురేష్, జి.చందు పాల్గొన్నారు.

ఏఎన్‌యు డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఏఎన్‌యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఏప్రిల్‌లో నిర్వహించిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మంగళవారం విడుదల చేశారు. బి ఎ, బి. కామ్, బీసీఏ, బిఏఓఎల్ కోర్సుల ఫలితాలు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 11103 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 8899మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు పరీక్షల నియంత్రణాదికారి రెడ్డి ప్రకాష్ రావు మాట్లడుతూ ఫలితాలకు సంబంధించి రీ వెరిఫికేషన్ కు రూ. 1700లు, రీ వాల్యువేషన్ కు ఒక్కో పేపర్ కు రూ. 1240 చెల్లించి జులై 2వ తేదీలోగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కు అందజేయాలని, ఆ దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా మాత్రమే యు జి కో ఆర్డినేటర్ కు అందేలా పంపాలని పేర్కొన్నారు. ఫలితాలు వర్శిటీ వెబ్సైట్ www. anu.ac.in నుంచి పొందవచ్చునని తెలిపారు.

కొనసాగిన లోకేష్ ప్రజాదర్బార్

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ కొనసాగించారు. మంగళవారం కూడా బాధితులు పెద్దఎత్తున తరలివచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారు. లోకేష్ అందరి కష్టాలు వింటూ వారికి భరోసా ఇస్తున్నారు. భద్రతా సిబ్బంది పెద్దఎత్తున ఉన్నా ఆటంకాలు కల్పించకపోవడంతో ప్రజలు భారీగా తరలివచ్చి తమ ఇబ్బందులు చెప్పుకుంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఉండవల్లిలోని తన నివాసంలో గంట నుంచి గంటన్నర సమయం ప్రజాదర్బార్ కోసం కేటాయిస్తున్నారు. బుధవారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకు మాత్రమే ప్రజాదర్బార్ ఉంటుందని లోకేష్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

తిరువూరు నగరపంచాయతీ

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 273/2023/ఇ1, తేది : 18-6-2024

తిరువూరు నగర పంచాయతీ నందు సాధారణ నిధుల నుండి శానిటేషన్ కన్సర్వెన్సీ ఐటమ్స్ సప్లయి, ట్రాక్టరు రిపేర్లు చేయుటకు టెండర్లు పిలువడమైనది.

1) బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది : 16-6-2024 ఉదయం గం. 11-00

2) బిడ్ స్వీకరణకు ఆఖరి తేది : 22-6-2024 సాయంత్రం గం. 5-00

కావున పై పనుల పూర్తి వివరములకు మరియు డౌన్‌లోడ్‌కు www.tender.apeprocurement.gov.in చూడవచ్చును అని తెలియజేయడమైనది.

సం/- కమీషనర్,
తిరువూరు నగరపంచాయతీ

CHANGE OF NAME

I, YARRAMREDDY NAGARJUNA REDDI (old name) Resident of D.No. 76-14-243/1B, Teachers Colony, Shivalayam Center,Bhavanipuram,Vijayawada,NTR Dist,AP.My Name has been changed to **YARRAMREDDY NAGARJUNA REDDY (new name)**.Hereafter my name is known as **YARRAMREDDY NAGARJUNA REDDY.**

నోటీసు

నా క్లయింటు కృష్ణాజిల్లా, కోడూరు మండలం, కోడూరు గ్రామ కాపురస్తుడు అయిన పతకమూరి నాగాచారి గారి కుమారుడు శివఫణి గారి తరఫున మీకు తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటుకు ఈ దిగువ షెడ్యూలు ఆస్తి అధికారంగా రిజిష్టర్ అయి స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. అట్టి స్థితిలో సదరు ఆస్తిని నా క్లయింటుకు సంబంధం లేకుండా అన్యాక్రాంతము చేయు ప్రయత్నాలు చేయుచున్నారని మాకు రూఢీగా తెలిసినందున నా క్లయింటు తరఫున ఈ ప్రకటన జారీ చేయుచున్నాము. సదరు ఆస్తిపై నా క్లయింటుకు తప్ప మరి ఏ ఇతరులకు హక్కులు లేవు. ఎవరైనా ఎట్టి అన్యాక్రాంతములకు పాల్పడినను అది చట్టరీత్యా చెల్లనేరదు. వారిపై తగు చర్య తీసుకొనబడును.

షెడ్యూలు

కృష్ణాజిల్లా, అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, కోడూరు మండలం, కోడూరు గ్రామంలో సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో వుండి వున్న స్థిరాస్థి వివరం. ఆర్.ఎస్. నెం.626-2 లో య. 0-04 సెంట్ల అందలి డోర్ నెం. 4-178 నెంబరుగా గల ఎసిసి ఇల్లు.

హద్దులు : తూర్పు : పద్యాల శ్రీనివాసరావుగారి 10 లింకుల వెడల్పు గల దారి అవతల టిటిడి కళ్యాణ మండపం హద్దు దక్షిణం : పద్యాల శ్రీనివాసరావుగారి స్థలం హద్దు. పడమర : చందల రాముగారి స్థలం హద్దు ఉత్తరం : మెయిన్‌రోడ్డు హద్దు.

ఈ హద్దుల మధ్యగల స్థిరాస్తి

ఇట్లు
పరుచూరి రాఘవేంద్రరావు,
న్యాయవాది, అవనిగడ్డ.

అవనిగడ్డ.
తేదీ: 18-6-2024 సెల్ : **94408 63317.**

దావా సమను

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE::NANDIGAMA
O.S.No.388/2021.

Between:
M/s. Shriram City Union Finance Limited, Rep. by its GPA holder & Authorized signatory in Office. .....Plaintiff.

And

1.Mallavarapu Veladri.
2.N. Krithi Kumari.
3.N.Navya.
4.N.Divya. ...... Defendants.

- - -

To
2. N. Kranthi Kumari, W/o. Rambabu, Hindu, Door No.26-61, LVF Church Road, Kondapalli Village, Ibrahimpatnam and Mandal, Krishna District.
3. N.Navya, D/o. Rambau, Hindu, Door No. 26-61, LVF Church Road, Kondapalli Village, Ibrahimpatnam and Mandal, Krishna District.
4.N.Divya, D/o.Rambabu, Hindu, Door No.26-61, LVF Church Road, Kondapalli Village, Ibrahimpatnam and Mandal, Krishna District.

పై నంబరు దావాలో వాది దావా బాకీ వసూలు నిమిత్తం దావాదాఖలు చేసినందున స్వతహాగా గానీ, ప్లీడరు ద్వారా గానీ, అట్లే అన్ని ప్రశ్నలకు వుత్తరము చెప్పగూడిన కూడా వచ్చే ఏదో మనిషి ద్వారా గాని సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగలందులకు 2023 సం ॥ 6వ నెల 28వ తేదీన 10.30 గంటలకు యీ కోర్టులో హాజరగుటకు వాయిదా యిచ్చి యున్నారు. ఆరోజున మీరు ఈ దావాలో సంజాయిషీ చెప్పుకొనుట కున్నూ శ్రీ కోర్టువారు వాయిదా యివ్వడమైనది. పై చెప్పబడ్డ దినమందు మీరు హాజరుగాకుండా తప్పిపోయే యెడల మీ పరోక్షమందు ఆ వాజ్యమును విమర్శ చేసి తీర్మానించటమగునని మీరు తెల్సుకోవలసినది.

వాయిదా 28-6-2023

T.V.MARKANDESWARA RAO
T.V.V.S.SARMA,
ADVOCATES NANDIGAMA

పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశా లలో మంగళవారం డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు (అడ్వైసర్ ఆఫ్ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ) మాతమూర్తి పొట్లూరి రామలక్ష్మి జ్ఞాపకార్థం విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్సిల్లు, బాక్సులు, బిస్కెట్ పాకెట్లు 100మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, రవీంద్రబాబు కు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్ర మంత్రిగా నాదెండ్ల మనోహర్ భాద్యతలు స్వీకరించిన సందర్భంగా గుడివాడ జనసేన నాయకులు మంగళవారం ఆయనను కలసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందుల రవి, పులపా మహేష్, పేర్ని జగన్ పాల్గొన్నారు.

బోడె ప్రసాద్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - గుడివాడ : పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ స్వగృహంలో మంగళవారం టిఎన్ఎస్ఎఫ్ కష్ణజిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ సత్యసాయి తన అనుచరులతో కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గూడూరు సురేంద్ర, సూరగాని సూరిబాబు, నిమ్మగడ్డ అరవింద్, సుంకర యువజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి ఉద్యోగుల నుండి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఉద్యోగులు సమర్పించిన అర్జీలు పరిశీలించిన కలెక్టర్ ఆయా శాఖల జిల్లా అధికారులు, సంబంధిత క్షేత్రస్థాయి అధికారులకు ఫోన్ చేసి ఉద్యోగుల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యల్లో ముఖ్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు తమ కోటా ప్రకారం సీనియర్ సహాయకులుగా పదోన్నతులు, గ్రేడ్ 2 వీఆర్వోలకు గ్రేడ్ 1 పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులకు 6, 12 సంవత్సరాల ఇంక్రిమెంట్లు పెండింగ్ ఉన్నవారికి వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలు పరిష్కరించాలని సమర్పించిన అర్జీలపై కలెక్టర్ మాట్లాడుతూ వీఆర్వో లకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులపై ఈనెల 20వ తేదీ సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక క్యాంపు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉద్యోగుల సంఘాలతో జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఉద్యోగ సంఘాలు కలెక్టర్ ను కోరగా, నిర్దేశించిన గడువు ప్రకారం కమిటీ సమావేశాలు రెగ్యులర్గా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఫ్యాప్టో

జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యయుల సమస్యలు పరిష్కరికానికి జిల్లా కలక్టర్ వెంటనే చొరవ చూపాలని జిల్లా కలక్టర్ కలక్టరేట్ స్పందన హాలులో మంగళవారం ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పిఎఫ్ ఆన్లైన్ సమస్యలు పరిష్కరించాలని, ఏలూరు జిల్లా జిల్లాలో కలిసిన ఎనిమిది మండలాలకు సంబంధించి గత అక్టోబర్ 2022 నుంచి పిఎఫ్ షెడ్యూల్స్ జనరేట్ కావడంలేదని వాటి సమస్యకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యోగులు ఉపాధ్యాయుల సమస్యలు చర్చించి పరిష్కరించి నిమిత్తం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కష్ణా జిల్లా ఛైర్మన్ బి లంకేష్ సెక్రెటరీ జనరల్ డి.అశోక్ కుమార్, కో ఛైర్మన్ యు.టి.ఎఫ్. జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బి. కనకారావు, జె .లెనిన్ బాబు, బిటిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, ఎ పి టి ఎఫ్ 257 నాయకులు ఏ.సుబ్రమణ్యం, ఎస్టియు నాయకులు చంద్రశేఖర్ ఏవీఎస్ ప్రసాద్ రావు , ఎం.మాధవరావు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆటో బోల్తా

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండం వీరవల్లి జాతీయ రహ దారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసు కుంది. వీరవల్లి నుంచి విజయ వాడ వైపు వెళుతున్న ఆటోని జంగా రెడ్డి గూడెం నుంచి బయలు దేరిన ఆర్టీసీ బస్సు ఢీకొంది .ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో ఆటోడ్రైవర్ బయటపడ్డారు.

బోల్తా పడిన ఆటో

జేమ్స్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు జేమ్స్ మృతి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి జేమ్స్ మంగళవారం గుంటూరు ఆసుపత్రిలో మృతిచెందారు. స్థానిక నాగవరపాడ్డులోని జేమ్స్ స్వగృహంలో ఆయన మృతదేహానికి పలువురు రాజకీయ నాయకులు, కార్మికులు నివాళులర్పించారు. జేమ్స్ అనారోగ్యంతో మతి చెందటంతో ఆయన మృతదేహానికి కృష్ణాజిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఘన నివాళి అర్పించింది. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు అనుబంధం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.వి. గోపాల్ రావు, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం జిల్లా అధ్యక్షుడు రాజీనాల సురేష్, కష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం జిల్లా, గుడివాడ పట్టణ కార్యదర్శి రేపానికొండ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి, సి ఐ టి యు గుడివాడ పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం గుడివాడ పట్టణ అధ్యక్షుడు దాస్ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొని జేమ్స్ కు పూలమాలలతో నివాళు లు అర్పించారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లు, పెనమలూరు మండలం వణుకూరులోని పలు షాపులలో దొంగతానాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. వీరి నుంచి సుమారు 60 వేల రూపాయలు నగదు రికవరీ చేసినట్లు చెప్పారు. మంగళవారం ఆయన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల 25వ తారీకు ఈడుపుగల్లు గ్రామం హైస్కూల్ ఎదురుగా ఉన్నటువంటి షాపులో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారని ఫిర్యాదు అందిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఈనెల 17వ తేదీన ఈడుపుగల్లు గ్రామ శివారులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. అలాగే వీరే ఈనెల 2వ తేదీన కూడా వణుకూరు గ్రామంలో దొంగతనాలు చేసినట్టు ఒప్పుకున్నారన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై 2 తాతాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

చల్లపల్లిలో...

ప్రజాశక్తి-చల్లపల్లి : క్వాలిఫైడ్ ఉపాధ్యా యులచే నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని చల్లపల్లి గ్రామ సచివాలయం-3 ఇంచార్జి కార్యదర్శి వేమూరి లావణ్య కోరారు. మంగళవారం స్థానిక ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సచివాలయ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల చిన్నారుల గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుకలను అంగన్వాడీ కార్యకర్తలు సందడిగా నిర్వహిం చారు. ఐదేళ్లు నిండి అంగన్వాడీని వీడి పాఠశాలల్లో చేరేందుకు సిద్ధమైన చిన్నారి బాల బాలికలకు అంగన్వాడీ సర్టిఫికెట్లు బహుకరించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, నాణ్యమైన విద్య గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ (నాలుగవ వార్డ్) ప్రధానోపాధ్యాయురాలు ఆళ్ల శివపార్వతి, అంగన్వాడి టీచర్లు రమణ కుమారి, సత్యవతి, హేమలత, అంగన్వాడి లబ్దిదారులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** బాపులపాడు మండలం వీరవల్లీ శాలివాహన కాలనీ అంగన్వాడీ కేంద్రం-3లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పిల్లా అనితా రామరావు, ఎంపీటీసీ అమతపల్లి సూర్యనారాయణ పాల్గొన్ని విద్యార్థులు గ్రాడ్యుయేషన్ సరిఫికేట్లు అంద జేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో నర్సరీ విద్యా పూర్తి చేసుకున్న చిన్నారులు పక్కనే ఉన్న మండల ప్రాథమిక పాఠశాల్లో చేర్పించారు. తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉచితంగా నాణ్యమైన విద్యతో పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారని కావున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని సర్పంచ్ పిల్లా అనిత రామారావు, ఎంపీటీసీ అమతపల్లి సూర్యానారాయణ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ ఎం భగరథ, మహిళ పోలీసు సోనీ, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, సుహాసిని, హేమలత (నారాయణపురం) పిల్లల తల్లిదండ్రులు పలువరు పాల్గొన్నారు. **ప్రజాశక్తి -పెదపారుపూడి :** మండలంలోని వానపాముల గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ ఎం శివ నాగమణి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే, అంగన్వాడి పిలుస్తుంది మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మాన్ని ఉద్దేశించి శివనాగమణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరములు నిండిన పిల్లలందరినీ ప్రాథమిక పాఠశాలకు పంపిస్తామన్నారు. అదేవిధంగా మూడు సంవత్సరాల నుండి పిల్లలందరినీ అంగన్వాడీలో చేర్చుకుంటామన్నారు. అంగన్వాడీ కేంద్రంలో కాన్వెంట్లకు దీటుగా విద్యాబోధన జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరంలో...

పెదపారుపూడిలో...

కాలుష్య నివారణకు నిధులు మంజూరు

నిధులు మంజూరు కార్యక్రమంలో అధికారులు, సమితి సభ్యులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కాలుష్యంతో బాధపడుతున్న విటిపిఎస్ పరిసర ప్రాంత ప్రజల సమస్యలపై పోరాట సమితి సభ్యులు విటిపిఎస్ ప్రతినిధులతో చర్చించిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో మంగళవారం పలు సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు విటిపిఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు, విటిపిఎస్ అధికారులు వివరాలు వెల్లడించారు. విటిపిఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి పోరాటం వల్ల విటిపిఎస్ నుంచి సిఎస్ఆర్ నిధులు 4 కోట్ల రూపాయలు సాధించారన్నారు. రూ.4 కోట్లతో ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు రూ.30 లక్షల మొక్కలు నాటడానికి మంజూరు చేశారు. రూ.10 లక్షల వ్యయంతో మెడికల్ క్యాంపుల నిర్వహణకు కేటాయించారు. సమావేశంలో పోరాట సమితి వారు వారి నిర్ణయాన్ని స్వాగతిస్తూనే వారి ముందు మరికొన్ని డిమాండ్లను ఉంచిందని పోరాట సమితి సభ్యులు తెలిపారు. మెడికల్ క్యాంపులు కాదు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టించాలి అనే ప్రధాన డిమాండ్ చేసినట్లు తెలిపారు. రహదారులకు ఇరువైపులా 12-15 అడుగుల మొక్కలు నాటాలని, నాటిన మొక్కలకు పరిరక్షించాలని సూచించామన్నారు. మొక్కలు పెరిగే విధంగా ఫెన్సింగ్ వెయ్యాలన్నారు. రైతులకు పొలాల్లో గట్ల మీద పెంచడానికి ఫ్రీ గా మొక్కలు ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. ప్రతి పాఠశాలలో మొక్కలు నాటించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మొక్కలు విరివిగా నాటించాలని, ఇంటి ఇంటికి మొక్కలు ఉచితంగా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. బూడిద చెరువు దగ్గర భద్రతా దళాలని పెంచాలని, ప్లాంట్ రీపేర్ చేయిస్తే గాలి కాలుష్యాన్ని కొంత మేర అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ప్లాంట్ నుండి వచ్చే కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించాలని తాము డిమాండ్ చేశామన్నారు. సిఎస్ఆర్ నిధులు రూ.30 కోట్లు రావాలని, అవి వచ్చే వరకు కాలుష్యం నియంత్రణ పోరాటం ఆగదని స్పష్టం చేశామని గుర్తు చేశారు. ఈ మేరకు నిధులు మంజూరు చేసినట్లు సభ్యులు తెలిపారు. నిధులు మంజూరు కార్యక్రమంలో ఎంపిడిఓ, ఎంపిపి విటిపిఎస్ అధికారులు, పరిసర ప్రాంత ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరపాలక సంస్థ పరిధిలోని కాళేశ్వరరావు మర్కెట్ (కేఆర్ మార్కెట్) ప్రాంతం నందు గల గద్ద బొమ్మ దగ్గర 900 ఎమ్.ఎమ్. డయ పిఎస్‌సి పంపింగ్ మెయిన్ లైన్ మరమ్మత్తు పనులు జరుగుతున్న కారణంగా ఈ నెల 19వ తేదీ ఉదయం నీటి సరఫరా ఈ క్రింది ప్రాంతాలలో నిలుపుదల చేయనున్నట్లు విఎంసి కమిషనర్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16 ఎంజిడి నుండ సరఫరా అగు ప్రాంతాలైన గాంధనగర్, హనుమాన్‌పేట, పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, బాప్టిస్ట్ పాలెం, కేదారేశ్వరపేట, లోటస్, రామలింగేశ్వరపేట, సత్యనారాయణ పురం, దుర్గాపురం, గులాబీతోట, మధురానగర్, శ్రీనగర్ కాలనీ, భానునగర్, టీచర్స్ కాలనీ, ముత్యాలంపాడు, గవర్నర్‌పేట, అరండల్‌పేట, సూర్యారావుపేట, కస్తూరిబాయిపేట, గిరిపురం, దుర్గా అగ్రహారం, సీతారాంపురం, బాదవ పేట, ఉడ్డు పేట, లబ్బీపేట, మల్లికార్జునపేట, ఉప్పర వాగు కొండ ప్రాంతాలలో 19వ తేదీ బుధవారం ఉదయం నిలుపుదల చేసి, మరమ్మతుల అనంతరం సాయంత్రం నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పైన తెలిపిన ప్రాంతాలకు సంబంధించిన డివిజన్లు నెంబర్లు 2, 6, 7, 19, 23, 24, 25, 27, 28, 34, 35, 36, 37, 52కు మంచినీట సరఫరా ఉండదని కమిషనర్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బాలుడి చికిత్సకు 'దీవెన' సహాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలంకు చెందిన గంధం శ్రీను రోజువారీ కూలీగా పనిచేస్తుంటాడు. ఇతని కుమారుడు గంధం కుటుంబరావు (16) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. కుమారుడి కేమోతెరపి ట్రీట్‌మెంట్ కోసం సంవత్సరం నుంచి చాలా ఖర్చు చేస్తూ, చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంటూ సహాయం కొరకు దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరపున గ్రూప్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ రాధాకష్ణ, మాచవరం హెడ్ కానిస్టేబుల్ శ్రీను మంగళవారం హాస్పిటల్‌కి వెళ్లి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పేదవారికి ఆపదలో ఉన్నవారికి క్యాన్సర్ పేషెంట్లకు సహాయం అందిస్తున్న గ్రూప్ సభ్యులకు తల్లి కతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌టిసి కాలనీ సమస్యలపై తాతయ్య దృష్టి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఆర్టీసీ కాలనీ సమస్యలలో వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావుకు తెలియజేశారు. కమిషనర్ ఆదేశాలతో ఏ ఈ, డి ఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, శానిటరీ విభాగం వారు, ఎలక్ట్రిషన్లు ఆర్టీసీ కాలనీ చేరుకొని, చిన్న చిన్న సమస్యలతో వెలగని వీధిలైట్లు అన్నిటిని సరిచేశారు. మిగిలిన వీధిలైట్లు న వం న్య న ం బుధవారం పరిష్కరి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపికి చెందిన 39వ బూత్ ఇన్‌ఛార్జ్ గడ్డం రాంబాబు యాదవ్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

లారీ కింద రక్తపు మడుగులో మృతదేహం (ఇన్‌సెట్‌లో) విద్యార్థి ఫైల్ ఫొటో

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ - జక్కంపూడి మార్గంలో చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ దాటి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ బిటెక్ చదువుతున్న విద్యార్థినిని లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీనిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విజయవాడ ప్రకాష్‌నగర్, విఎంసి శానిటరీ ఆఫీసు సమీపంలోని కాపు కనకదుర్గా, శ్రీనివాస్ దంపతుల రెండో కుమారుడు కాపు హర్షవర్ధన్ (19) నందిగామ మిక్ ఇంజినీరింగ్‌లో కాలేజీలో బిటెక్ సిఎస్ఇ గ్రూఫ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం ఉదయం హోండా షైన్ బైక్‌పై కాలేజీకి వెళ్ళాడు. మధ్యాహ్నం కాలేజీ అయిపోగానే ఇంటికి వస్తున్న క్రమంలో చనుమోలు వెంకట్రావు (సివిఆర్) ఫ్లై ఓవర్ దిగి వైఎస్ఆర్ కాలనీ మీదుగా వైవి రావు రింగు వైపుకు మధ్యాహ్నం సుమారు 12.15 గంటలకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వైఎస్ఆర్ కాలనీ మెయిన్ రోడ్డు దగ్గర ఉన్న భారత్ పెట్రోల్ బంక్ దాటగానే లారీ డ్రైవర్ లారీని అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ విద్యార్థి హర్షవర్ధన్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టాడు. దీంతో హర్షవర్ధన్ వీపుకు వున్న కాలేజీ బ్యాగ్ లారీకి పట్టుకుని వంద గజాలు దూరం ఈడ్చుకుని వెళ్ళింది. దీంతో లారీ టైర్లు హర్షవర్ధన్ మీదకు ఎక్కడంతో అక్కడి కక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కుమారుడి మృతుని చూసి తల్లడిల్లిపోయారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న టూటౌన్ సిఐ గణేష్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండలాల్లో గాలి, వాన

ధ్వజస్తంభంపై పిడుగు పడటంతో పగిలిన దృశ్యం

పడిపోయిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణం, పరిసర గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులతో 13 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో నేల కూలిన వృక్షాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. జగ్గయ్యపేట, బలుసుపాడు రోడ్డు, రామచంద్రునిపేట, షేర్ మహమ్మద్ పేట రోడ్డులో మోడల్ కాలనీ సమీపంలో చెట్టు కరెంటు స్తంభంపై పడి స్తంభం కింద పడిపోవడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బలుసుపాడు, రామచంద్రుని పేట గ్రామాల్లో రాత్రి మొత్తం కరెంటు లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని గ్రామాల్లో ట్రాన్స్ కో సిబ్బంది సోమవారం అర్ధరాత్రి ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేశారు. నేల బురదమయం కావడంతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు ఆటంకం కలిగింది. మరో రెండు రోజులు సహాయక చర్యలు కొనసాగే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్ కో ఏఇ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ గాలి వాన తుఫాను వల్ల ట్రాన్స్‌కోకు 10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన భీభత్సం సృష్టించింది. గ్రామంలో రామాలయ ఆవరణలోని ధ్వజస్తంభంపై పిడుగుపడింది. పిడుగుపాటు వలన ధ్వజస్తంభం అడుగు భాగం పగిలిపోయింది. అక్కడే ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం కూడా స్వల్పంగా దెబ్బతింది. ఆ సమయంలో ఆలయంలో ఉన్న నలుగురు యువకులు కళ్లెదురుగా పిడుగు పడడంతో స్పృహ తప్పి పడిపోయారు. కాసేపటి తర్వాత తేరుకొని ఇళ్లకు వెళ్లిపోయారు. పిడుగుపాటు విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయడంతో వారు హుటాహుటిన ఆలయంలోకి వచ్చి దెబ్బతిన్న ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. పిడుగుపాటుతో దెబ్బ తిన్న ఆలయంలో వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న కాగిత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న కొండలమ్మ అమ్మవారిని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మ వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రం, అమ్మవారి చిత్రపటంతో సత్కరించి, వేద పండితులు ఆశీర్వచనం పలికినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

కాగితకు శేషవస్త్రం అందజేస్తున్న ఆలయాధికారులు

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆలయం నందు ప్రతిరోజూ జరుగు నిత్య అన్నదానం పథకంనకు శివాజీపాలెం, విశాఖపట్నంకు చెందిన సాధనాల హిమవర్షిణి మరియు కుటుంబ సభ్యులు లక్ష రూపాయలను దేవస్థానం నందు జరుగు అన్నదానం నిమిత్తం మంగళవారం ఆలయ అధికారులను కలిసి దేవస్థానానికి విరాళం అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు దర్శనం కల్పించగా, వేదాశీర్వచనం చేసి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

జోగి రమేష్ ఇంటిపై దాడిచేసిన వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 16న మాజీ మంత్రివర్యులు జోగి రమేష్ ఇంటిపై రాళ్లు విసిరిన విజయవాడ కస్తూరి బాయి పేటకు చెందిన కోడి సాయి కృష్ణ అలియా బుడ్డ సాయి గాజుల సువార్త రాజు పామర్తి సాయి శ్రీనివాస్ గురజపు రాంబాబు తాళ్ల వెంకట విజయ్ కుమార్ అను వారిని అరెస్టు చేసినట్లు 17న రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

విద్యుత్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ స్తంభంపై పని చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కృష్ణలంక పోలీస్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక బెంజిసర్కిల్ చంద్రమౌళి పురంలో భవానీపురానికి చెందిన టి.ఆనంద్ కుమార్ విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా కిందపడి గాయాల పాలయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మృతుడి భార్య పార్వతి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆనంద్‌కుమార్ విద్యుత్ మీటర్ రీడింగ్ తీసేవాడని పోలీసులుతెలిపారు.

ఆగని గ్రావెల్ దోపిడీ

• గొల్లనపల్లిలో యథేచ్ఛగా తవ్వకాలు

ప్రొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వం మారినా గన్నవరం మండలంలో గ్రావెల్ దోపిడీ ఆగడం లేదు. వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు గొల్లనపల్లిలోని ఆర్ఎస్ నెంబర్ 88లో అక్రమ క్వారీయింగ్ చేసి జేబులు నింపుకుంటున్నారని విమర్శలు ఉన్నా మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గన్నవరం మండలం గొల్లనపల్లి పరిధిలో ఉన్న ఆర్. ఎస్ నెంబర్ 88 లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. అయితే కొంతమంది వ్యక్తులు కొద్దిగా అనుమతులు తీసుకుని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమిని మొత్తం తవ్వేస్తున్నారు. గ్రావెల్ దోపిడీకి పాల్పడి జేబులు నింపుకుంటున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మైనింగ్ దోపిడీ మాత్రం ఆగడం లేదు. గతంలో మాజీ ఎమ్మెల్యే వంశీ పేరు చెప్పి అక్రమ తవ్వకాలు చేసేవారు. ఇప్పుడు టిడిపి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారంలోకి వచ్చినా వైసీపీకి చెందిన వ్యక్తులే గ్రావెల్ ను లూటీ చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. గ్రావెల్ కొండలను, ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను కొనేసి పెద్ద గోతులు పెట్టి లూటీ చేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు వైసిపిలో చక్రం తిప్పిన వ్యక్తులు ఇప్పుడు రంగు మార్చినట్లుగా ప్రచారం చేసుకుంటూ అడ్డగోలు తవ్వకాలకు శ్రీకారం చుట్టారనే ఆరోపణలు ఉన్నాయి. గొల్లనపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు కీలకంగా ఈ తవ్వకాలు సాగిస్తున్నట్లుగా చెప్తున్నారు. ప్రొక్లైన్లు కొనుగోలు చేసి తవ్వకుపోతున్నారు. ఈ అక్రమ తవ్వకాలకు అడ్డే లేకుండా పోతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొంతమంది రాజకీయ నాయకులు, వ్యక్తులకు గ్రావెల్ కాసుల వర్షం కురిపిస్తుంది. అధికారుల అండదండలతో అక్రమ తవ్వకాలు యదేచ్ఛగా జరిగిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అంతకుముందు గ్రామంలోని చెరువులో మట్టిని తినేసి జేబులు నింపుకున్నారని విమర్శలు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ అధికారులు చిన్నపాటి అనుమతి ఇస్తే.. దానిని అడ్డం పెట్టుకొని చెరువునే కొల్లగొట్టేస్తున్నారని రైతులు చెప్పారు. మట్టి యదేచ్ఛగా తరలిపోతుంటే చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడని విమర్శిస్తున్నారు. అదేమని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే మట్టి దొంగలను సమర్థిస్తూ వారిని వెనకేసుకురావడం జరుగుతోందని గతంలో రైతులు తెలిపారు. ఇప్పుడు మాఫియా కన్ను క్వారీపై పడింది. ఇష్టానుసారంగా గ్రావెల్ తరలించుకుపోతున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. క్వారీలో పెడుతున్న పెద్దపెద్ద గోతుల వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. గోతుల్లోకి నీరు చేరితే ఆ గోతుల్లో పడి మనుషులు మరణిస్తారని, అందువల్ల అధికారులు తవ్వకాలను పరిశీలించాలని చెబుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు మాకేం సంబంధం లేదని తెగేసి చెబుతున్నారు. రబ్బీసును ప్రైవేటు భూముల్లోకి తోలుకొని జేబులు నింపుకుంటున్నారని ఇందులో వైసిపి నాయకులుగా చలామణి అవుతున్న వ్యక్తుల పాత్ర ఉందని గ్రామస్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

గ్రామంలో రోడ్డు ధ్వంసం...

భారీ లోడుతో వెళుతున్న గ్రావెల్ లారీల వల్ల గ్రామంలో రోడ్డు ధ్వంసమై గోతులు పడుతున్నాయని చెబుతున్నారు. దుమ్ము కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నిళ్ళుగా గ్రావెల్ లారీల వల్ల రోడ్డంతా పూర్తిగా చంద్రమైంది. జనం గోతుల్లో ప్రయాణించాల్సి వచ్చింది. పార్టీ మారిన తవ్వకాలు మాత్రం ఆగడం లేదని,తమ గ్రామంలో రోడ్లసమస్యకు పరిష్కారం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమ రబ్బిస్ దొంగల పై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హై స్కూల్లో మంగళవారం 10వ తరగతి పరీక్షల్లో 586 మార్కులకు జిల్లా తృతీయ స్థానం సాధించిన పి మను బాలాజీకి 5000 రూపాయల నగదు ప్రశంసా పత్రాన్ని సాయి అన్న వీరభద్రయ్య వీర రాఘవమ్మ సేవా సమితి చైర్మన్ సాయన సుశీలరావు అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో అధిక మార్కులు సాధించిన జె సాత్విక్, కు, పి నివేదిక, ఈ హిమలత, గుంజ దీపికకు, గౌసియా బేగంలకు వెయ్యి రూపాయల నగదు బహుమతి,ప్రశంస పత్రాలు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలని నిరసన

నిరసన తెలుపుతున్న భవిష్యత్ భద్రతా దళం నాయకుడు

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉన్న అనధికార ఫ్లెక్సీలు తొలగిం చాలని కోరతూ భవిష్యత్ భద్రత దళం నాయకుడు వైవి మురళీ కృష్ణ నిరసన తెలిపారు. మంగళవారం మార్కెట్ సెంటర్‌లోని మూడెడ్ల రామారావుచౌక్‌లో భవిష్యత్ భద్రత దళం నాయకుడు వైవి మురళీకృష్ణ నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ సిబ్బంది వెంటనే స్పందించి పట్టణంలో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు.

ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా ప్రసన్న

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ గా తూము ప్రసన్న బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు బ్రాడీపేట ఇండియన్ బ్యాంకు శాఖ బీఎంగా విధులు నిర్వహిస్తూ ప్రసన్న సాధారణ బదిలీలో భాగంగా చల్లపల్లి ఇండియన్ బ్యాంకు శాఖకు మేనేజరుగా నియమితులై మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, విశ్రాంత ఈఓఆర్డీ,అంబెడ్కర్, పూలే చైతన్య వేదిక కన్వీనర్ దాసి సీతారామరాజు, ఉద్యోగులు ప్రసన్నకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

లంక భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని పాపవినాశనం గ్రామం కష్ణానది వరద ముంపు లంక భూములకు పట్టాలిచ్చి, కరెంట్ సౌకర్యం కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండా దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ, పాపవినాశనం గ్రామంలో సుమారు 30 ఎకరాల వరద ముంపు లంక భూమిని ఆక్రమించి, తుప్పలు నరికించి, మిట్ట పల్లాలు సరి చేయించి, కూరగాయలు, తదితర ఆహార ఉత్పత్తులు పండించటానికి సుమారు 50 కుటుంబాలకు పంచటం జరిగిందన్నారు. వీరు ఆహోరాత్రాలు శ్రమించి భూమిని సాగులోకి తెచ్చారని, ఇందు కోసం ఆయిల్ ఇంజన్లతో గుంటల్లో నీరు తోడి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నా ఫలసాయానికి డీజిల్ ఖర్చుకు సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సదరు భూమిని పరిశీలించి, సర్వే జరిపించి, పట్టాలు మంజూరు చేసి, విద్యుత్ సౌకర్యం కల్పించి, భూమిలేని వ్యవసాయ కూలీల ఉపాధి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సి హెచ్.సుదీర్, జిల్లా నాయకుడు జక్కుల నెలబాలుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జనార్ధనరావు పాల్గొన్నారు.

హోంమంత్రికి ఎస్‌పి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కార్యాలయానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హెూం శాఖామంత్రి వంగలపూడి అనితను కృష్ణాజిల్లా తాడిగడపలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీతో పాటు ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌విడి ప్రసాద్, గన్నవరం డిఎస్పి జై సూర్య హెూం మంత్రి అభినందనలు తెలిపారు.

కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక జగన్నాథపురంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అర్చకుడు అప్పలాచారి తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 19వ తేదీ సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు.

మాట్లాడుతున్న కృష్ణాజిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.పద్మావతి

ఖరీఫ్‌కు సిద్ధం కావాలి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఖరీఫ్ సీజన్ కు సంబంధిత అధికారులు సంసిద్ధం కావాలని కష్ణాజిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.పద్మావతి ఆదేశించారు. సీజన్లో చేపట్టాల్సిన వ్యవసాయ శాఖ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. మచిలీపట్నం మండల వ్యవసాయ కార్యాలయంలో మచిలీపట్నం సబ్డివిజన్ పరిధిలోని మూడు మండలాల వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ సహాయకులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మట్టినమూనా పరీక్షల ఫలితాలను రైతులకు తెలిపేలా చర్యలు తీసుకోవాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలను డీ-క్రిష్ యాప్ ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. పీఎంకిసాన్లో ఐదు శాతం ఫిజికల్ వెరిఫికేషన్ రికార్డులను వెంటనే గ్రామాల్లో పరిశీలన చేసి అనర్హులు ఉంటే గుర్తించాలని వీఏఏలకు సూచించారు. ఆర్బికేల్లో అవసరమైన ఎరువుల ఇన్డండ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డీడీఏ ఎస్. వి.మనోహర్, ఏడీఏ ఎ మణిధర్, టెక్నికల్ ఏఓలు బి.సురేష్ బాబు, నాయిక్, జి.గీతాంజలి, ఎ శాంత , డివిజన్ పరిధిలోని మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాల ఏఓలు హరిక,శ్రీనివాసరావు,శివ ప్రసాద్, ఆయా మండలాల వీఏఏలు మరియు ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.అలాగే డివిజన్ పరిధిలో డీలర్లతో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి శనివారం సమావేశమయ్యారు. డీలర్లు అందరూ ఎరువులు, పురుగుమందులు, విత్తనాల రిజిస్టర్లు, బిల్ బుక్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎన్.పద్మావతి హెచ్చరించారు.

బాలికల హాస్టల్‌ను మైలవరంలోనే కొనసాగించాలి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి - మైలవరం : ఎన్నో ఏళ్లుగా మైలవరంలో ఉన్న బాలికల హాస్టల్‌ను మరోచోటకు తరలించాలని చూస్తున్నారని మైలవరంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.చరణ్, ఉపాధ్యక్షులు పి.సాయిలు మాట్లాడుతూ 2009 నుంచి మైలవరంలోనే బాలికల హాస్టల్ కొనసాగుతుందని ఎంతోమంది ఇంటర్ నుండి డిగ్రీ వరకు విద్యార్థులు చదువుకోవటానికి అనువుగా ఉందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే బాలికల హాస్టల్‌ను గొల్లపూడికి మార్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, కనీస సమాచారం లేకుండా హాస్టల్‌ను మార్చడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న హాస్టల్‌ను మైలవరంలోనే కొనసాగించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దీపక్, డి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలోని బాలికల హాస్టల్ కొనసాగించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు

నగరంలో 'బడి బాట'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో మంగళవారం అంగన్వాడీ పిలుస్తోంది.. బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.విజయ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించామన్నారు. అంగన్వాడీ కేంద్రంలో అయిదేళ్ల నిండి, పూర్వ ప్రాథమిక విద్య పూర్తయిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని కూడా నిర్వహించి, పిల్లలకు పట్టాలిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 59వ డివిజన్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకటి నుంచి పంచదార, కందిపప్పు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : జూన్‌లో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పును ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. గత వైసిపి ప్రభుత్వంలో ఏడాదిగా కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. దీంతో పేదలు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు.

రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు ఇవ్వడం లేదన్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. సిఎం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు కదిలారు. రాష్ట్రస్థాయిలో కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు పంపారు. ఈ నెల 20వ తేదీ నుంచి రేషన్ షాపులకు బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, పంచదారను సరఫరా చేయాల్సి ఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లో దించిన చెక్కర, కందిపప్పు నాణ్యతతోపాటు అక్కడికి వచ్చిన ప్యాకెట్లను తూకం వేసి పరిశీలించారు. వచ్చేనెల 1 నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు.

నిధుల విడుదలను వీక్షిస్తున్న ఎఒ పద్మ తదితరులు

రైతుల ఖాతాల్లోకి పిఎం కిసాన్

ప్రజాశక్తి - తిరువూరు : పి.ఎం.కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వారణాసిలో విడుదల చేసే రూ.రెండు వేలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి తిరువూరు కార్యాలయంలో రైతులు వీక్షించారు. తిరువూరు మండలంలో 6,919 మంది లబ్దిదారులకు రూ.1,38,38,090 ఈ విడతలో జమ కానున్నాయని ఏవో పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు జి.కెన్నెడీ, 8వ వార్డు కౌన్సిలర్ నాళ్ళ సురేంద్ర, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పిఎం కిసాన్ పథకం ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గంలో అర్హులైన 2069 మంది రైతులకు 413.94 లక్షల నిధులు జమ అయినట్లు వ్యవసాయ శాఖ ఎడి సి.భవాని తెలిపారు. మూడు సమాన విడతల్లో డిబిటిల ద్వారా రైతులు ఖాతాలో ఈ సొమ్ము జమ చేసినట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని వ్యవసాయ సిబ్బంది ద్వారా లైవ్ టెలికాస్ట్ చేయటం జరిగిందని, ఈ టెలికాస్ట్ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం రైతులకు పిఎం కిసాన్ నగదుకు అర్హత కలిగిన రైతులు తమ ఆధార్ కార్డు, పొలం, బ్యాంకు ఖాతాకు అనుసంధానం, ఇకెవైసి అవగాహన కల్పించినట్లు తెలిపారు. జగ్గయ్యపేట మండలంలోని 6,957 మంది రైతులకు 139.5 లక్షలు, వత్సవాయిలోని 7,097 మంది రైతులకు 141.94 లక్షలు, పెనుగంచిప్రోలు మండలంలోని 6645 మంది రైతులకు రూ.132.9 లక్షలు రైతుల ఖాతాలకు నిధులు జమయినట్లు ఆమె తెలిపారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి : కోట కళ్యాణ్

విజయవాడ : జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సమస్యలను పరిష్కరించాలని అడిగిన వారికి వెంటనే పనులు కల్పించాలని వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా పీడీకి వినతిపత్రం సమర్పించారు. కొన్ని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలు మండలాలు, గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం దృష్టికి వచ్చిన సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేసినట్లు తెలిపారు. ప్రధానంగా చందర్లపాడు మండలం చందర్లపాడులో ఉపాధి హామీ పనులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జిల్లాలో వేతన బకాయిలు నాలుగు నుంచి ఐదు వారాలు ఉన్నాయని వీటిని వెంటనే విడుదల చేయాలని కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని కష్టపడి పనిచేసిన రోజు వేతనం రూ.270కు మించట్లేదని కూలి పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మస్తర్లు పని ప్రదేశంలో వెయ్యాలని మస్తర్ సీట్లు మేట్లకు అందుబాటులో ఉంచాలని పనిముట్లు ఇవ్వాలని మంచినీరు ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పలుగు పారలకు డబ్బులివ్వలేదని ఆయన అన్నారు. అధికారులు జోక్యం చేసుకుని ఉపాధి హామీ పనులు సమర్థవంతంగా అమలు జరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యం.సోమేశ్వరరావు, టి.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : హైదరాబాద్ ఫిలింనగర్లో ఈనాడు, ఈటీవీ ఉషా కిరణ్ మూవీస్ సంస్థల అధినేత రామోజీరావు మరణం తీరని లోటని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి నాయకులు బుద్దా వెంకన్న తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రామోజీరావు స్వగృహం వెళ్లిన ఉత్తరాంధ్ర ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి , నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రాయితీపై వరి విత్తనాలు

ప్రజాశక్తి - వీరులపాడు : ఈ ఖరీఫ్‌కాలంలో వీరులపాడు మండలంలోని రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ తెలిపారు. పంపిణీ నిమిత్తం 154.8 క్వింటాల ఎంటియు-1061 రకం, 80 క్వింటాల బిపిటి-5204 రకం మండలం మొత్తం మీద అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వరి విత్తనాల నాణ్యత నిమిత్తం మొలక శాతం చూడటం జరుగుతుంది. మొలక శాతం బాగున్నట్లయితే రాబోవు ఒకటి రెండు రోజుల్లో రైతులకు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద వరి విత్తనాలు రాయితీపై పంపిణీ చేశారు. ఎంటియు-1061 రకం, బస్తా 30 కేజీలు 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.1194, సబ్సిడీ రూ.150, రైతు కట్టవలసింది రూ.1044 అదే విధంగా బిపిటి 5204 రకం బస్తా 25 కేజీలు, 25 కేజీల బస్తా పూర్తి ధర రూ.1045, సబ్సిడీ రూ.125, రైతు కట్ట వలసింది రూ.920 అని తెలిపారు. విత్తనాలు కావాలిసిన రైతులు తమ రైతు భరోసా కేంద్రంలోని విఎఎలను సంప్రదించి రాబోవు ఒకటి రెండు రోజుల్లో బయోమెట్రిక్ విధానం ద్వారా విత్తనాలు పొందొచ్చన్నారు. మండలంలోని 'వరి పంట' వేసే రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జోగేంద్ర ప్రసాద్ ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు వినియోగించుకోవాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ, మంచి నీటి సరఫరా గురించి అవగాహన కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పారిశుధ్య పనులు మంచినీటి సరఫరా, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రతి గ్రామ పంచాయతీలో ఖచ్చితంగా అమలు అయ్యేలా తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.సాంబశివరావు, విస్తరణాధికారి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లైమ్ స్టోన్ మైన్స్ సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైం స్టోన్ మైన్స్‌లో యూనియన్ నాయకులు మంగళవారం ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని అడ్మిన్ బిల్డింగ్ ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మూడు నెలలుగా ఒకటో తేదీన చెల్లించాల్సిన జీతాలు 20 తేదీ వచ్చినా చెల్లించడం లేదని వాపోయారు. రూ.23,467 వేల కోట్లు టర్నోవర్ గల విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ని సమయానికి జీతాలు చెల్లించలేని దుస్థితికి తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం ఉన్న మేనేజ్మెంట్ దీనికి ప్రధాన కారణమని, మేనేజ్‌మెంట్ ఈ రోజుకి కూడా జీఎస్టీ పన్నులు కట్టాలి. ముడిసరుకు కొనడానికి డబ్బులు లేవని కుంటి సాకులతో కార్మికుల పొట్టన కొడుతున్నారని వాపోయారు. సమయానికి జీతాలు పడక బ్యాంకులకు ప్రతినెలా చెల్లించాల్సిన ఇఎంఐ ఆలస్యం వల్ల ప్రతి కార్మికుడు వేల రూపాయల పెనాల్టీ కట్టాల్సివస్తుంది. ఇప్పటికైనా పరిస్థితిని చక్కబెట్టి సకాలంలో జీతాలు చెల్లించాలని లేకుంటే ముందు ముందు జరగబోయే పరిణామాలకు మేనేజ్‌మెంట్ పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం డిజిఎం (మైన్స్) ఇన్‌ఛార్జ్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. మైన్స్

ఇన్‌చార్జ్ నాగరాజు మాట్లాడుతూ ఈ సమస్య గురించి పై అధికారులకు తెలియజేస్తానని త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, బిఎంఎస్, డిఐటియు యూనియన్ నాయకులు జెవిఎస్‌డి.ప్రసాద్, వలిబాబు, విజయకుమార్, జోమి థామస్, రామచందర్ నాయక్, మన్నే శ్రీనివాసరావు, ఉద్యోగులు ఎస్‌ఎస్‌కెబిఎస్.వర్మ, రామకృష్ణ, మల్లం రాంప్రసాద్, హేమ నాయక్, నవీన్, దేవోజి, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

వాలంటీర్లుగా కొనసాగించాలని వినతి

బుద్ధప్రసాద్‌ను కలిసిన వాలంటీర్లు, చల్లపల్లి తహసీల్దార్ సుమతి, ఉద్యోగులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎన్నికల ముందు బలవంతంగా రాజీనామా చేయించిన తమకు నూతన ప్రభుత్వంలో ఏర్పాటు చేయబోయే వాలంటీర్ వ్యవస్థలో తమనే కొనసాగించాలని చల్లపల్లికి చెందిన పంచాయతీ పరిధిలోని వాలంటీర్లు మంగళవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాదం ఆయన స్వగృహం వద్ద కలసి వినతి పత్రం అందజేశారు. గడచిన ఐదేళ్లుగా తాము చల్లపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయం 1,2,3 లలో వాలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్నామని, గడచిన సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు తమతో సమావేశం నిర్వహించి బలవంతంగా రాజీనామా చేయించారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తాము ఎక్కడా పాల్గొనలేదని, అందువల్ల నూతన ప్రభుత్వంలో ఏర్పాటు చేసే వాలంటీర్ వ్యవస్థలో తిరిగి తమను కొనసాగించాల్సిందిగా కోరుతూ బుద్ధ ప్రసాద్కు వినతిపత్రం అందజేశారు.

బుద్ధప్రసాద్‌కు సత్కారం : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అవనిగడ్డ నుండి విజయం సాధించిన మండలి బుద్ధ ప్రసాద్‌ను చల్లపల్లి తాసిల్దార్ బి సుమతి సత్కరించారు. మంగళవారం ఆమె అవనిగడ్డలోని బుద్ధ ప్రసాద్ స్వగృహానికి వచ్చి ఆయనను మర్యాదపూర్వకంగా కలసి పూలగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. నాలుగోసారి విజయం సాధించడం తోపాటు అత్యధిక మెజార్టీ అందుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఆర్ఐ ఘంటసాల కష్ణమోహన్, వీఆర్వోలు కిరణ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అవనిగడ్డలో భారీ వర్షం

వర్షానికి జలమయమైన రహదారులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత వడగాలితో అల్లాడుతున్న అవనిగడ్డ ప్రజలకు ఉపశమనం కలిగినట్లు అయింది. నాలుగు రోజుల నుండి ఎండ వేడి తీవ్రంగా ఉండటంతో పాటు వడగాలులు కూడా వీయడంతో ప్రజలు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. దీనితో మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో వాతావరణం చల్లబడి ప్రజలు కాస్త ఊరట చెందారు. అయితే రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించాయని చెప్పుకుంటున్న తరుణంలో వర్షాలు పడకపోవడంతో రైతులంతా వ్యవసాయ పనులు చేసుకునేందుకు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం ఒక వారం రోజులపాటు అయిన వర్షాలు కురిస్తే వ్యవసాయ పనులు మొదలు పెట్టుకోవచ్చు అని రైతులు ఆశిస్తున్నారు. సుమారు 45 నిమిషాల పాటు కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం కాగా అవనిగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షపు నీటితో నిండిపోయింది.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

చంద్రబాబును కలిసిన మంత్రి కొల్లు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడిని మైన్స్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

పిఎం కిసాన్ నిధులు విడుదల

ప్రజాశక్తి-గుంటూరు : భారత ప్రధాని నరేంద్రమోదీ పీఎం కిసాన్ 17వ విడత నిధులను మంగళవారం సాయంత్రం వారణాసి నుంచి రైతుల ఖాతాలకు జమచేసే కార్య క్రమం ప్రత్యక్ష ప్రసారం లాంలోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయ శాఖ కమిషనర్ సీహెచ్ హరి కిరణ్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణకుమార్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగ న్నాద్, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా విజయ లక్ష్మి వీక్షించారు. పీఎం కిసాన్ పథకం 2024-25 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత రూ.2వేలు చొప్పున జిల్లాలో 85,400 మంది రైతులకు రూ.17.08 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి రవీందర్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా పీడీ రాజకుమారి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఉన్నతాధికారులు



పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ప్రభుత్వ రాయితీలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో నైపుణ్యం కనపరచాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం పమిడిముక్కల మండలంలోని తాడంకి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫారంను వర్ల కుమార్ రాజా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రాయితీలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. క్రమశిక్షణతో కూడిన నైతిక విలువలు కలిగిన విద్యను భావితరాలకు ఉపాధ్యాయులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పద్మరాణి, శ్రీనివాస్, పమిడిముక్కల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవ నారాయణ, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మీ, మంటాడ గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ, తాడంకి గ్రామ కార్యదర్శి టీవీ రమణ, ఎస్సై శ్రీనివాస్, టిడిపి నాయకులు జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు లంక కాళిదాసు ప్రథమ వర్ధంతి సభ

ప్రజాశక్తి - గుడివాడ : ఈనెల 19వ తేదీన సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ లంకా కాళిదాసు ప్రథమ వర్ధంతి సభ జరగనున్నట్లు పట్టణ కార్యదర్శి ఆర్ సిపి రెడ్డి మంగళవారం తెలిపారు. సుందరయ్య భవనంలో బుధవారం సాయంత్రం జరిగే ఈ సభకు ఉపన్యాసకులుగా సిపిఎం రాష్ట్ర నాయకులు తులసిరావు, ముఖ్యఅతిథిగా సిపిఎం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి వై నరసింహారావులు పాల్గొంటారని తెలిపారు. కావున పార్టీ సభ్యులు అభిమానులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆర్‌సిపి రెడ్డి కోరారు.

23న రోశయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కీర్తిశేషులు కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ ఈనెల 23వ తేదీన అవనిగడ్డలో నిర్వహించనున్నట్లు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటలకు ఫైర్ స్టేషన్ ఎదురుగా గల ప్రధాన రహదారి ప్రక్కన గాంధీ పొట్టి శ్రీరాములు విగ్రహాల పక్కన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య, ఏపీ వాణిజ్య కమిటీ చైర్మన్ దూండీ రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘానికి చెందిన వారంతా హాజరు కావాలని వారు కోరారు.

మొక్కు చెల్లించుకున్న నాయకులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, పామర్రు ఎమ్మెల్యేగా వర్ల కుమార్ రాజా ఎన్నిక అయితే 101 కొబ్బరికాయలు కొడతానని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆముదాలపల్లి గోపాలకృష్ణ మొక్కుకున్నారు. ఈ మేరకు మంగళవారం పమిడిముక్కల మండలంలోని హనుమం తపురం అడ్డరోడ్డు వద్ద ఆంజనేయ స్వామి గుడిలో మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో నాదెండ్ల సుబ్రహ్మణ్యం, లింగమనేని బాబూరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, తోడేటి ముత్తయ్య, లక్ష్మీనారాయణ, పి. బాబు ,పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం వీరవల్లి జడ్పీ హైస్కూల్లో ,2024-25 నూతన విద్యా సంవత్సరం సంబంధించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం,బూట్లు పలురకాల వస్తువులు కలిగిన కిట్లు విద్యార్థులకు అందజేశారు. 6వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులు అందరికీ ఈ కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకుని ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని బాగా రాణించాలని ప్రధానోపాధ్యాయులు నిర్మల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గుండపనేని ఉమా వర ప్రసాద్, బుజ్జి లంక, సురేంద్ర మోహన్ బేనర్జి, సర్పంచ్ పిళ్ళా అనిత రామారావు, ఉప సర్పంచ్. లంక అజయ్, ఎంపీటీసీ అమతవల్లి సూర్యనారాయణ నాని, జడ్పీటీసీ గంగా భవాని, పేరెంట్స్ కమిటీ మెంబెర్ దేవా పాల్గొన్నారు

ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-గుంటూరు : సిపిఎస్, సిపిఎస్‌పై ప్రభుత్వ పున:సమీక్ష చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో చాంద్‌బాషా మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సిపిఎస్, జిపిఎస్ బిల్లు రద్దుపై పునరాలోచన చేసి, ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలని కోరారు. ఓపిఎస్ పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగులు కోరి, మెచ్చి తెచ్చుకున్న ఈ ప్రభుత్వ హయాంలోనే ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగులు ఆశాభావంతో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం ఓపిఎస్ పునరుద్ధరించి ఉద్యోగుల పక్షపాతిగా నిలవాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి పెద్ద రత్తయ్య, మహిళా విభాగా ప్రధాన కార్యదర్శి సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎన్.సిహెచ్.శ్రీనివాస్

ప్రజాశక్తి - తిరువూరు : ఎన్నికల్లో టిడిపి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సి.హెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పర్సా సత్యనారాయణ శత జయంతి సభ తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు నాయకులు మరకాల ఇశ్రాయేలు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముందుగా పర్సా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ, ఆశాలకు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. మున్సి పల్ కార్మికులకు చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని, తిరువూరులో ఆరు సంవత్సరాలుగా వెట్టి చాకిరీ చేస్తున్న మున్సిపల్ అదనపుకార్మికులను 14 మందిని వెంటనే ఆప్కాస్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అంగన్వాడీ ఆశా, మధ్యా హ్న భోజన పథకం, శానిటేషన్ వర్కర్స్ ని మా ప్రభు త్వం వచ్చింది కాబట్టి తొలగిస్తామని అక్కడ దక్కడ టిడిపి నాయకులు మాట్లాడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. చిరు ఉద్యో గులపై రాజకీయ వేధింపులు తక్షణమే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పర్సా సత్యనారాయణ జీవిత చరిత్రను వివరించారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఉద్యోగులపై, కార్మికులపై ఎటువంటి కక్ష సాధింపులు ఉండవని చెప్పున్నారని, కానీ స్థానికంగా టిడిపి నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌సి హెచ్.సుప్రజ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎస్.వి.భద్రం సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు ఉపాధ్యక్షులు పంతంగి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సిహెచ్.నాగరాజు, నిర్మల, ఆకుల.రామారావు, లాలయ్య, సురేష రమణ, నాగమణి, సులోచన, మరియు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతులకు క్షేమ కానుక 'సుకృతి' ప్రారంభం

మాట్లాడుతున్న సి.వి.కుమార్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్, దేశంలోని కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రధాన పంట బీమా పథకం సుకృతిని అందుబాటులోకి తీసుకువచ్చింది. కేవలం రూ.499కే క్షేమ పంట బీమా పథకం అందుబాటులో ఉందని చీఫ్ అండర్ రైటింగ్ ఆఫీసర్ సీవీ.కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు బీమా చేయించుకోవడానికి రూ.499 మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. రైతులకు తగినంత శక్తిని తిరిగి అందించేలా 100 పైగా ఎక్కువ పంటలను రక్షించే పంట బీమా పథకాలున్నాయని తెలిపారు. రుతుపవనాల రాకతో అన్ని ముఖ్యమైన ఖరీఫ్ పంటలు విత్తే కాలం మొదలవుతున్నందున ఈ బీమా ఉత్పత్తిని అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. సుకృతిని కొనుగోలు చేయడానికి క్షేమ యాప్లోకి లాగిన్ కావాలని, ప్రకృతి వైపరీత్యాలు, జంతువుల దాడి, విమానాల వల్ల పంటనష్టం కలిగితే పరిహారం పొందొచ్చని చెప్పారు. రైతులకు తమ పంటలను ముందుగా నిర్ణయించిన తొమ్మిది ప్రమాదాల జాబితా నుంచి ఒక పెద్ద, ఒక చిన్న ప్రమాదాల కలయికతో బీమాను ఎంచుకోవచ్చన్నారు. తమ పంటను ఎక్కువగా ప్రభావితం చేసే పలు విపత్తుల నుంచి రైతులకు ఇది భరోసా అందిస్తుందన్నారు. తుఫాను, ఉప్పెన, వరదలు, కొండచరియలు విరిగిపడటం, పంట నష్టాలు సైతం కవర్ చేసేలా బీమా అందుబాటులో ఉందన్నారు.

కంప్యూటర్ అప్లికేషన్స్‌పై మరింత పట్టు సాధించాలి

వర్క్‌షాప్‌లో విద్యార్థులకు వివరిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు కంప్యూటర్స్ రంగంలో వస్తున్న నూతన అప్లికేషన్స్‌పై మరింత పట్టు సాధించినప్పుడు విస్తృతమైన ఉపాధి అవకాశాలను పొందొచ్చని ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జీఎన్ఎస్ పవన్‌కల్యాణ్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో 'పెగా అప్లికేషన్ డవలప్‌మెంట్' అంశంపై వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన జీఎన్ఎస్ పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ప్రజలకు వారి జీవన విధానాన్ని మరింత సులువు చేయటానికి, దేశాభ్యున్నతికి నూతన సాంకేతిక విప్లవం అండగా నిలుస్తుందన్నారు. ఆ క్రమంలో కంప్యూటర్స్ రంగం విశేషమైన అభివృద్ధిని సాధిస్తుందన్నారు. అందులో భాగంగా పెగా అప్లికేషన్ వివిధ రంగాల్లో ప్రజలకు విశేషమైన సేవలను పొందేందుకు అండగా ఉంటుందన్నారు. వ్యాపార ప్రక్రియల్లో వినియోగదారులకు నాణ్యమైన, వేగవంతమైన సేవలందించేందుకు ఈ నూతన అప్లికేషన్ తోడ్పడుతుందన్నారు. బ్యాంకింగ్, మెడికల్, టెలికమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో సమాచారాన్ని సేకరించటం, దానిని విశ్లేషించటం త్వరగా ఫలితాన్ని అందించటం వంటి అంశాలు ఈ అప్లికేషన్ ద్వారా పొందవచ్చని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న నూతన మార్పులపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి పీ రవీంద్ర పాల్గొన్నారు.

పది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.63,410 లు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ బి.అనుష తె లిపారు. ఆమెకు అందిన సమాచారం మేరకు రాయనపాడు గ్రామంలోని కాటంనేని దుర్గారావు ఇంటి వద్దకు తన సిబ్బందితో వెళ్లారు. దుర్గారావు ఇంటి లోపల పొట్టూరి ప్రసాద్, మధుకూరి రాంబాబు, బుగ్గ ప్రేమ్‌చంద్, పార్థీ సూర్యప్రకాష్‌రావు, అంగిరేకుల శివ నాగరాజు, సముద్రాల వినయ్ కుమార్ రెడ్డి, రాంబాబు, పెన్మమ శెట్టి శివరామకృష్ణ, పోతాని గిరిబాబు పేకాట ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వారిపై 3, 4 ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం సిఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు తాతయ్య అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కెవికె ఇండోర్ స్టేడియం విద్యార్థులు ఈనెల 16వ తేదీ ఖమ్మం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అండర్ 11 కేటగిరిలో టి.నదియా మొదటి బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. టి.సమద్ అండర్ -15 కేటగిరిలో రెండో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి బాడ్మింటన్‌కి ఎంపికయ్యాడు. వీరిని మంగళవారం జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఎ పి.బాడ్మింటన్ కోచ్ కె.గోపి, పి.సలామ్, ఎన్.జీవన్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

పర్సు అందజేస్తున్న డిఎం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రాజమండ్రి నుండి విజయవాడకు ఆర్టీసీ బస్సు ఏపి 11 జెడ్ 6735లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు ఎస్.వెంకట లక్ష్మి తమ పర్సును మరిచిపోయి వెళ్ళిపోయారు. విషయం తెలుసుకొని 17న డిపో మేనేజర్‌ని కాంటాక్ట్ చేశారు. 18న ఇబ్రహీం పట్నం డిపోకు రాగా వారి పర్స్‌లో ఉన్న రూ.26,120 లు బ్యాంక్ కార్డ్స్, ప్రామిసరీ నోట్స్, ఐడి కార్డు అన్ని ఇబ్రహీంపట్నం డిఎం ఎ.సుబ్రమణ్యం చేతుల మీదుగా వారికి అప్పగించారు. ఈ సందర్భంగా వెంకట లక్ష్మి ఎంతో సంతోషంతో డిపో మేనేజర్‌కు, ఆర్టీసీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ బస్సు కండక్టర్ కె.వై.కొండలును డిఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌ఛార్జ్ ఎస్.శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామంలోని హైస్కూలు విద్యార్థులకు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు స్టూడెంట్ కిట్లను మంగళ వారం అందజేశారు. విద్యా శాఖ అందజేస్తున్న కిట్లలో అన్ని సబ్జెక్ట్‌ లకు సంబంధించిన పాఠ్య పుస్తకాలతో పాటు, టోఫెల్ వర్కుబుక్, ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్ట్ పుస్తకంతో పాటు 3 జతల యూనిఫాం క్లాత్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, అక్స్ఫర్డ్ నిఘంటువు ఉంటుంది. 6 నుంచి 10 తరగతులకు నోట్ బుక్స్ అందజేశారు. పదోతరగతి సోషల్ స్టడీస్ పుస్తకాలను సి.బి.ఎస్.ఈ బోధనా విధానంలో జాగ్రఫీ, ఎకనామిక్స్, చరిత్ర, డెమొక్రటిక్ పాలిటిక్స్ సబ్జెక్టులుగా ఎన్. సి.ఈ.ఆర్.టి సిలబస్‌ను అందజేశారు. ఫిజికల్ సైన్స్ పుస్తకాలను ఆర్ట్ పేపర్‌పై ముద్రించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఎన్డీఏ మహాకూటమి ప్రభుత్వం ఫ్యూచర్ స్కిల్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చిందని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఎంఎల్ఎ కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. హైస్కూలు ఉపాధ్యాయులు, స్థానిక టీడీపీ నాయకులు, ఎన్డీఏ మహాకూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఏ సౌమ్యకు సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యను ఎవిఆర్‌పిఎం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ ప్రెసిడెంట్ వేమూరు సత్యనారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ ఏ దుర్గాభవాని, సెక్రటరీ , సీనియర్ న్యాయవాది వివిఎల్.ఎన్. పూర్ణేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎం ఆర్ పి ఎస్ నాయకులు మందా పిచ్చయ్య, మందా ప్రసాద్‌లు ఎంఎల్ఏ తంగిరాల సౌమ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నందిగామ సెక్టర్ అనాసాగరం హనుమంతపాలెం గ్రామాల పరిధిలో 17 మంది పిల్లలకు 5 ప్లస్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. 17 మంది పిల్లలకు. గవర్నమెంట్ స్కూల్లో చేర్చారు. ఐసిడిఎస్ నందిగామ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.కరుణ కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు ఎంఎస్‌కె తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : సీనియర్ న్యాయవాది రేగళ్లమోహన్ రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ, దోషులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. చింతలపాడు గ్రామానికి చెందిన పిడపర్తి నారాయణరెడ్డి, అయన భార్య లక్ష్మీకుమారి, కుమారుడు బ్రహ్మారెడ్డిలపై ముక్కెర వెంకట కృష్ణారెడ్డి హైకోర్టులో వేసిన పిటీషన్‌ను రాజీ చేసుకునేందుకు ఈ నెల 15న తిరువూరులోని డాక్టర్ కృపారెడ్డి ఇంటికి న్యాయవాది మోహన్‌రెడ్డిని నారాయణ రెడ్డి, బ్రహ్మారెడ్డి పిలిచారని బార్ అసోసి యేషన్ అధ్యక్షులు వాకదాని లక్ష్మీనారాయణ, కార్యదర్శి షేక్ గౌస్ తెలిపారు. మాట్లాడే క్రమంలో తండ్రీ కొడుకులిద్దరూ ముక్కెర వెంకట కృష్ణారెడ్డిపై, మోహన్ రెడ్డిపై దాడిచేసి కేసుకు సంబంధించిన విలువైన దస్తావేజులను, ప్రాంసరీ నోట్లను చించివేశారని చెప్పారు. న్యాయవాది మోహన్ రెడ్డిపై దాడిచేసిన తండ్రీకొడుకులు ఇద్దరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లక్ష్మీనారాయణ, గౌస్ డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు ఫీలర్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబరుకు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.